క్లుప్తంగా

ఎర్రవరం ఆలయంలో మాజీ హోంమంత్రి పూజలు



ఎర్రవరం ఆలయం వద్ద మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు

కోదాడరూరల్ : మండల పరిధిలోని ఎర్రవరంలో గల దూళ్లగుట్ట శ్రీబాల ఉగ్రలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ హోంమంత్రి వసంత నాగేశ్వరరావు గురువారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి పూజలు జరిపించారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

మోతె : మండల పరిధిలోని రావిపహాడ్‌లో గురువారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా డప్పు చప్పుళ్లతో ఆలయానికి వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

వేపచెట్టుకు కల్లు



వేపచెట్టు నుంచి కారుతున్న కల్లు

చిలుకూరు : పాత చిలుకూరులోని కోదండరామాలయం ఎదురుగా గల బజార్‌లో వేప చెట్టుకు గత రెండు రోజులుగా కల్లు కారుతోంది. దీంతో స్థానిక ప్రజలు వేప చెట్టుకు పూజలు చేస్తున్నారు. దేవుడి మహిమతో వేప చెట్టుకు కల్లు కారుతోందని అంటున్నారు.

విద్యార్థులకు స్టీల్ బౌల్స్ అందజేత



ఉపాధ్యాయుడు అందజేసిన స్టీల్ బౌల్స్‌తో విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు పీడమర్తి వీరబాబు సొంత ఖర్చుతో స్టీల్ బౌల్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్. సువర్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్ వీరబాబు తన సొంత డబ్బులతో విద్యార్థులు రాగి జావ తాగేందుకు బౌల్స్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నళిని, కృష్ణయ్య, చిన్నప్ప, రాంరెడ్డి, సీతారాం, హరి, జ్యోతి, పవిత్ర, కృష్ణవేణి, ధర్మేష్, యాదయ్య, మన్మథరెడ్డి, శ్రీకర్, ఖాజామొయినోద్దీన్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఓజో ఫౌండేషన్ సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న వెంకన్న

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గుండెపంగు ప్రసాద్ ఇటీవల మృతి చెందారు. అదే విధంగా గుండెబోయిన కామేశ్వరమ్మ అనారోగ్యంతో బాధ పడుతున్నారు. గురువారం ఇరువురి కుటుంబాలకు ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు ఆదేశాల మేరకు ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న బియ్యం, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ సభ్యులు గోపి, వీరనరసింహ, సుధాకర్, సాయిబాబా, మధు, రవినాయక్, బాబు, బలరాం, బాబునాయక్, జిలానీ, సైదులు, చిన్ని, సైదా, తదితరులు ఉన్నారు.

బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్రా సుధారాణి గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బుర్రా దాసిరెడ్డి, మండల నాయకులు తొగరు రమేష్, కందిబండ సత్యనారాయణ, నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, సుంకర అజయ్‌కుమార్, తొగరు సత్యనారాయణ, ఉపేందర్, లింగారెడ్డి, నాగిరెడ్డి, సీతారాములు, కృష్ణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఫాతిమాభేగం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీటీసీలకు ఎదురుదెబ్బ !

- హుజూర్‌నగర్ ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే
- హాట్ టాపిక్‌గా మారిన వ్యవహారం
- రసవత్తరంగా రాజకీయం



హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలో అధికార పార్టీ ఎంపీటీసీలకు ఎదురుదెబ్బ తగిలింది. సొంత పార్టీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌పై అవిశ్వాసం పెట్టగా, ఎంపీపీ కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారు. దీంతో ఈ నెల 19న జరగాల్సిన అవిశ్వాస తీర్మానం ఆగిపోయింది. ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని జూలైలో వేపలసింగారం ఎంపీటీసీ ముడెం గోపిరెడ్డి, అమరవరం కాంగ్రెస్ ఎంపీటీసీ (వైస్ ఎంపీపీ) సింగతల సైదమ్మ, గోపాలపురం ఎంపీటీసీ చీకూరి రాజారావు, లింగగిరి ఎంపీటీసీ వల్లభనేని విజయలక్ష్మి, లక్కవరం ఎంపీటీసీ రణపంగు కాశమ్మలు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. దీంతో ఈ నెల 19న అవిశ్వాసం పెడుతున్నట్లు, ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ఏడుగురు ఎంపీటీసీలకు ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. కానీ జూలై 27న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చాడు. దీంతో గత నెల 30న అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీలు హైకోర్టులో కేవీయట్ దాఖలు చేసినా ఫలితం లేకుండా పోయింది. హైకోర్టు నుంచి అధికారులకు సైతం నోటీసులు వెళ్లాయి. దీంతో సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఎంపీటీసీలందరికి హుజూర్‌నగర్ ఎంపీడీఓ నోటీసులు జారీ చేశారు. అవిశ్వాస తీర్మాన సమావేశం వాయిదా వేసినట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ శాంతకుమారి తెలిపారు.

ఎమ్మెల్యేతో సఖ్యతగా లేనందున..

మండలంలోని ఏడు ఎంపీటీసీ స్థానాల్లో నాలుగు కాంగ్రెస్, మూడు బీఆర్‌ఎస్ గెలిచాయి. బూరుగడ్డ నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎంపీటీసీ గూడెపు శ్రీనివాస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. కరక్కాయలగూడెం, లక్కవరం, బూరుగడ్డ, అమరవరం ఎంపీటీసీలు కాశమ్మ, సైదమ్మలు కాంగ్రెస్ నుంచి విజయం సాధించగా ఎంపీపీగా ఎన్నికైన శ్రీనివాస్, లక్కవరం ఎంపీటీసీ కాశమ్మ ఉపఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో కరక్కాయలగూడెం ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, అమరవరం ఎంపీటీసీ సైదమ్మ (వైస్ ఎంపీపీ) మిగిలారు. కాంగ్రెస్‌లో ఉన్న ఎంపీటీసీ సైదమ్మ సైతం అధికార పార్టీ ఎంపీటీసీలకు మద్దతుగా ఎంపీపీకి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానంపై సంతకం చేశారు. ఇదిలా ఉండగా ఎంపీపీ శ్రీనివాస్ మొదటి నుంచి ఎమ్మెల్యే సైదిరెడ్డితో సఖ్యతగా లేనందున ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్న గోపిరెడ్డి అవిశ్వాస తీర్మానానికి జై కొట్టారు. అధిష్టానం అండదండలతో అవిశ్వాసం పెట్టినా కోర్టు స్టేతో ఎదురుదెబ్బ తగిలిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మండల పరిషత్‌లో హైడ్రామా

ఎంపీపీపై అవిశ్వాసం పెట్టాలని అధికార పార్టీ నాయకులు ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మండల పరిషత్‌లో రాజకీయ హైడ్రామా నెలకొంది. వివిధ పనులకు సంబంధించి మండల పరిషత్ తీర్మానం లేకుండా అధికారుల సహకారంతో అవిశ్వాసం పెట్టిన ఐదుగురు ఎంపీటీసీలు క్యాష్ బుక్‌లో తీర్మానం చేసి నమోదు చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీనివాస్ తీర్మానం క్యాష్ బుక్‌ను జీరాక్స్ తీసేందుకు బయటకు తీసుకువెళ్లారు. దీంతో సూపరింటెండెంట్ నర్సిరెడ్డి ఎంపీపీ శ్రీనివాస్‌పై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. కాగా ఎస్‌ఐ హరికృష్ణ ఎంపీపీని క్యాష్ బుక్ ఇవ్వాలని కోరగా ఆయన సమక్షంలో మండల పరిషత్ అధికారులకు అప్పగించారు. ఈ విషయంపై ఎంపీపీపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఎంపీపీని పీఠం నుంచి దింపేందుకు అధికార పార్టీ ఎంపీటీసీలు ప్రయత్నాలు చేసిన నేపథ్యంలో తీర్మానాల బుక్‌పై రాజకీయ రంగు పులిమారని ఎంపీపీ వ్యాఖ్యానించడంతో ఎంపీటీసీలు అధికార బీఆర్‌ఎస్ కీలక నేతల మధ్య ఆధిపత్య పోరుకు తెరలేచింది. ఏదిఏమైనా ఈనెల 19న నిర్వహించాల్సిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే విధించిన నేపథ్యంలో సమావేశం రద్దు కావడం రాజకీయ వర్గాలలో సంచలనంగా మారింది. హుజూర్‌నగర్ అధికార పార్టీలో ఎంపీపీ అవిశ్వాసం హాట్ టాపిక్‌గా మారింది.

సీఎం సభను జయప్రదం చేయాలి

కోదాడ : సూర్యాపేటలో ఈ నెల 20న జరిగే సీఎం సభను విజయవంతం చేయడానికి నాయకులు కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ పట్టణ అధ్యక్షుడు చందు నాగేశ్వరరావు కోరారు. గురువారం కోదాడలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని 35 వార్డుల నుంచి 10 వేల మంది కార్యకర్తలను సభకు తరలించేలా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యబాబు, వెంపటి మధు, షేక్ నయీమ్, గంధం పాండు, బెజవాడ శ్రావణ్, బత్తుల ఉపేందర్, సంపెట ఉపేందర్, శ్రీధర్, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నడిగూడెం : సూర్యాపేటలో ఈ నెల 20న నిర్వహించనున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ యాతాకుల జ్యోతి కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. సూర్యాపేటలో సీఎం కేసీఆర్ అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నడిగూడెం, కాగితరామచంద్రాపురం సహకార సంఘం చైర్మన్లు పుట్టా రమేష్, గోసుల రాజేష్, మాజీ చైర్మన్లు సురేష్‌ప్రసాద్, గార్లపాటి శ్రీనివాసరెడ్డి, చంద్రయ్య, ఆంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

చిలుకూరు : సూర్యాపేటలో ఈ నెల 20వ తేదీన జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభలో పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డీసీసీబీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొండా సైదయ్య కోరారు. గురువారం చిలుకూరులో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలం నుంచి 5 వేల మందికి పైగా సీఎం కేసీఆర్‌కు సభకు తరలించేందుకు సమాయాత్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నలబోలు శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జానిమియా, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడు బజ్జూరి వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ అలసకాని జనార్దన్, మాజీ జెడ్పీటీసీ భట్టు శివాజీనాయక్, వేనేపల్లి ఉపేందర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మునగాల : మాట్లాడుతున్న తొగరు రమేష్

మునగాల : సూర్యాపేటలో ఈనెల 20న జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభలో కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి రెండు వేల మంది కార్యకర్తలను సభకు తరలించేలా మండల బాధ్యులు కృషిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు ఎస్.అజయ్‌కుమార్, ఎలక నరేందర్‌రెడ్డి, కందిబండ సత్యనారాయణ, నల్లపాటి శ్రీనివాస్, కోల ఉపేందర్‌రావు, గోపిరెడ్డి నాగిరెడ్డి, ఉప్పుల యుగంధర్‌రెడ్డి, కృష్ణ, సీతారాములు, లింగారెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌కు ఐటీఐ మంజూరు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌కు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కృషి ఫలించింది. ఐటీఐతో పాటు 17 రెగ్యులర్, 5 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాష్ట్ర ఐటీఐ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావుతోపాటు నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కుష్టువ్యాధిని సకాలంలో గుర్తిస్తే మేలు

హుజూర్‌నగర్ : కుష్టువ్యాధిని సకాలంలో గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా కాపాడవచ్చని డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాతంగి సురేష్ బాబు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహిస్తున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆశా కార్యకర్తలు ఈనెల 31 వరకు ఇంటింటికి తిరిగి చర్మంపై స్పర్శ లేని, రాగి వర్ణపు మచ్చలు వున్న వారిని గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, ఆశా కార్యకర్తలు నిర్మల, నాగేంద్ర, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డాక్టర్‌కు సన్మానం




డాక్టర్ దశరథనాయక్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

కోదాడ : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ వైద్యుడిగా అవార్డు పొందిన డాక్టర్ దశరథ నాయక్‌ను గురువారం కోదాడలో గిరిజన సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. పేదరికంలో పుట్టి కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగిగా ఉత్తమ సేవలందిస్తున్న దశరథను గిరిజన విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైదానాయక్, బర్మావత్ రాజునాయక్, భూక్యా రవినాయక్, పంతుల్యానాయక్, రాంప్రసాద్, రాజేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు

నేరేడుచర్ల : ప్లాస్టిక్ కవర్లు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపాలిటీ పర్యావరణ ఇంజనీర్ మాలోతు శివ అన్నారు. గురువారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని వివిధ దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి ఒక దుకాణంలో 120 మైక్రాన్ కన్న తక్కువ ఉన్న 55 కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రెండు వేల రూపాయలు జరిమాన విధించారు. ఈ తనిఖీల్లో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె షరీఫ్, వార్డు అధికారులు ఎస్‌కే నజీర్, ఎస్‌కే నాగుల్ మీరా, గోపినాథ్, మధుసూదన్‌రావు, శ్రీను తదితరులు ఉన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

మోతె : గృహలక్ష్మి పథకానికి వచ్చిన దరఖాస్తులపై క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయలంలో మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత ఇళ్ల స్థలాలు ఉండి అర్హులైన పేదలను గుర్తించుటకు సంబంధిత అధికారులు గ్రామాల్లో పర్యటించి పూర్తి వివరాలను సేకరించాలన్నారు. అనంతరం నివేదికను అందించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ సూరయ్య, ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ హరిసింగ్, ఆర్‌ఐలు అజయ్, మన్సూర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

➡ వికలాంగుల బస్‌పాస్ మేళా

గరిడేపల్లి : మండల కేంద్రంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపియాదవ్ ఆధ్వర్యంలో గురువారం బస్ పాస్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వికలాంగులకు వందశాతం రాయితీ కల్పించాలని కోరారు. గంధం గంగయ్య, మచ్చ శ్రీను, సైదులు, లక్ష్మీనారాయణ, సైదులు ఉన్నారు.

➡ 18న సర్వాయి పాపన్న జయంతి

మఠంపల్లి : మండల కేంద్రంలో ఈనెల 18న నిర్వహించబోయే సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలకు ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని మఠంపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు వల్లపుదాసు మహేష్‌గౌడ్ గురువారం కోరారు.

➡ సాగర్ నీటిని విడుదల చేయాలి

హుజూర్‌నగర్ : నీరు లేక ఎండిపోతున్న నారుమళ్లు, వరి పొలాలను కాపాడేందుకు సాగర్ నీటిని విడుదల చేయాలని రాష్ట్ర రైతు సంఘం నాయకుడు బ్రహ్మం అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పరిధిలో ఆయన నారు మళ్లను పరిశీలించి మాట్లాడారు.

➡ టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

మఠంపల్లి : మండల కేంద్రంలో గురువారం టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదును ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరస్వామి, చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు కమల, శ్రీమన్నారాయణ, రామకృష్ణ, శ్రీనివాస్, కిరణ్‌బాబు, సైదులు, నరేష్ తదితరులు ఉన్నారు.

➡ నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పాలకవీడు : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటాచారి గురువారం తెలిపారు. గత తొమ్మిది రోజులుగా జిల్లా రీసోర్స్ పర్సన్స్ బృందం గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి నివేదికలు తయారు చేసినట్లు పేర్కొన్నారు. తుది నివేదికను ప్రజావేదికలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీలు హాజరుకావాలని కోరారు.

➡ సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు మృతి తీరని లోటు

హుజూర్‌నగర్ : సీనియర్ జర్నలిస్ట్ కృష్ణారావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణారావు నాలుగు దశాబ్దాలకు పైగా మీడియా రంగానికి సేవలందించారని చెప్పారు. ఆయన మృతి పట్ల సంతాపం తెలిపారు. సమావేశంలో హుజూర్‌నగర్ యూనియన్ ప్రతినిధులు, విలేకరులు పాల్గొన్నారు.

➡ మానవత్వం చాటుకున్న వార్డుసభ్యుడు

నడిగూడెం : మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఎనిమిదో తరగతి విద్యార్థిని స్పందనకు బుధవారం రాత్రి 11 గంటల సమయంలో శరీరంలో గ్యాస్ ఫామ్ కావడంతో తోటి విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి నడుచుకుంటూ తీసుకెళ్తున్నారు. విద్యార్థి ఇబ్బంది పడడాన్ని గమనించిన స్థానిక వార్డు సభ్యుడు బాణాల నాగరాజు తన కారులో విద్యార్థినిని స్థానిక ఆసుపత్రికి తరలించి సకాలంలో వైద్యం చేయించి మానవత్వం చాటుకున్నాడు. దీంతో స్థానికులు నాగరాజును, స్పందన తోటి స్నేహితులను అభినందించారు.

➡ 'బీఆర్‌ఎస్ కార్యకర్తలకే దళితబంధు'

మునగాల : దళితబంధు కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకే అందుతోందని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తాడువాయి గ్రామానికి మంజూరైన ఏడు దళితబంధు యూనిట్లను ఆ పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పార్టీ కార్యకర్తలకే కేటాయించినట్లు తెలిసిందన్నారు. వారికి భూమి ఉందని, గ్రామంలో సెంటు భూమిలేని నిరుపేద దళితులు అనేక మంది ఉన్నప్పటికీ స్థానిక నాయకులు కేవలం పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. గ్రామసభ ఏర్పాటు చేసి రాజకీయాలకతీతంగా అర్హులైన వారిని ఎంపిక చేయాలని శ్రీనివాస్ కోరారు.

➡ వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : మండలంలోని ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆకుపాములకు చెందిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకుడు బాణాల మల్లాచారి– శారద దంపతుల మనుమడు విగేంద్రచారి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు కటకోజు నాగేంద్రచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేశోజు ఉపేంద్రచారి, సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ, పవన్ కళ్యాణ్‌చారి– మణికుమారి, నాయకులు రామాచారి, శ్రీ నివాసాచారి, బ్రహ్మచారి, వీరాచారి ఆశ్రమ నిర్వాహకురాలు విజయమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

➡ వందశాతం సీసీరోడ్లు పూర్తి

పాలకవీడు : బెట్టెతండా గ్రామపంచాయతీ పరిధిలో వంద శాతం సీసీరోడ్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ మాళోతు మోతీలాల్ తెలిపారు. గురువారం పంచాయతీ పరిధిలోని పాడ్యాతండాలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి మాట్లాడారు. జెడ్పీటీసీ మలోతు బుజ్జి నిధులు రూ.13 లక్షలతో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. వార్డు సభ్యులు బాలాజీనాయక్, నాగ్యనాయక్, నాయకులు హుస్సేన్‌నాయక్, శ్రీనునాయక్, కృష్ణానాయక్, నాని, నాగేందర్, మంగి తదితరులు పాల్గొన్నారు.

కోదాడ పట్టణ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



కోదాడలో వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : కోదాడ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని 18వ వార్డులో రూ. 15 లక్షల వ్యయంతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం 20వ వార్డులో పర్యటించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, వార్డు కౌన్సిలర్ కర్రి శివ, నాయకులు చందు నాగేశ్వరరావు, కర్రి సుబ్బారావు, బెజవాడ శ్రావణ్, వెంపటి మధు, వీరబాబు, వెంకటరత్నం, మాధవి, జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి మృతి బాధాకరం

కోదాడ : బీఆర్‌ఎస్ నాయకుడు ప్రతాపరెడ్డి తండ్రి వీరారెడ్డి మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడలోని ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎంపీపీ కవిత, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది



జయశంకర్, శ్రీకాంతాచారి విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న శశిధర్‌రెడ్డి

కోదాడ : అమరుల త్యాగం మరువలేనిదని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. గురువారం కోదాడ పట్టణ పరిధిలోని బాలుర హైస్కూల్ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తున్న జయశంకర్ సార్, శ్రీకాంతాచారి విగ్రహాలకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన జీవితాన్ని త్యాగం చేసిన జయశంకర్‌సార్, మలిదశ ఉద్యమంలో ప్రాణాలను త్యాగం చేసిన శ్రీకాంతాచారిలను ప్రతి తెలంగాణ బిడ్డ గుర్తుంచుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం తాము చేసిన పోరాటానికి అమరుల త్యాగమే కారణమన్నారు. వారి స్ఫూర్తితో పోరాడి తెలంగాణను సాధించుకున్నామన్నారు. డాక్టర్ బ్రహ్మం, మోత్కూరి వీరభద్రాచారిల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింత కవిత, చందు నాగేశ్వరరావు, పాండురంగారావు, బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం శ్రీనివాసరెడ్డి, రాయపూడి వెంకటనారాయణ, అనిల్, వెంకటాచారి, నర్సింహచారి, వీరభద్రాచారి, తిరుపతిచారి, సత్యబాబు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, వంగవేటి రామారావు, ధనమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శశిధర్‌రెడ్డి పరామర్శ

నడిగూడెం : మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన కాసాని కాశయ్య (50) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. గురువారం గ్రామంలో నిర్వహించిన దశదినకర్మకు బీఆర్‌ఎస్ పార్టీ కోదాడ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బొలిశెట్టి నాగేంద్రబాబు, కొణతం శ్రీనివాసరెడ్డి, పంద్ల కోటయ్య, వీరబాబు, ప్రభాకర్, మండవ నాగమణి, దున్నా ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భూమి ఆక్రమించుకున్నారంటూ..

- సెల్ టవర్ ఎక్కి దివ్యాంగుడి హల్‌చల్



సెల్‌టవర్‌పై నాగరాజు

నడిగూడెం : తన అక్రమించుకున్నారంటూ ఓ దివ్యాంగుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. ఈ ఘటన నడిగూడెం మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు దున్నా నాగరాజు కొంత వ్యవసాయ భూమి ఉంది. 35 సంవత్సరాలుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నామని, తన తండ్రి గుర్వయ్య పేరిట పాత పట్టాదారు పాస్ పుస్తకం ఉన్నదని పేర్కొన్నాడు. ఆ పాస్ పుస్తకంలోని సర్వే నంబరును తొలగించి, ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెల్ టవర్ వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో తహసీల్దారు నాగేశ్వరరావు హామీనివ్వడంతో సెల్ టవర్ దిగాడు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



మన ఊరు–మన కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న పందిరి నాగిరెడ్డి

కోదాడ : రానున్న ఎన్నికల్లో రాష్ట్రం, కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వాలేనని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. మన ఊరు–మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతగిరి మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసినా కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖయమని ధీమా వ్యక్తం చేశారు. కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జలందర్, పాష, రామకోటయ్య, హరి, రాము తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం



ఆపరేషన్ నిమిత్తం రోగులను తరలిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

మునగాల : మండలంలోని కొక్కిరేణి శివారులో డాక్టర్ పోటు పుల్లయ్య స్మారకార్థం ఏర్పాటు చేసి ఆర్‌ఎస్‌ఎస్ సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివేకానంద వైద్యశాలలో ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ఉచిత వైద్యంతో పాటు ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నామని ఆస్పత్రి డాక్టర్ మారుతిశర్మ తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం, నడిగూడెం మండలంలోని చాకిరాల, రంగాపురం గ్రామాలకు చెందిన ముగ్గురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఒకరికి గుండె ఆపరేషన్, మరొకరికి వెన్నుపూస ఆపరేషన్, ఇంకొకరికి కిడ్నీ ఆపరేషన్ చేయాల్సి రావడంతో నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి శివారులో గల కామినేని వైద్యశాలకు తమ అంబులెన్సులో తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయించినట్లు వివరించారు.

ఆర్ కృష్ణయ్యను అరెస్టు చేయడం సరైంది కాదు

హుజూర్‌నగర్ : సమగ్ర శిక్షణ ఉద్యోగుల ధర్నాకు మద్దతుగా నిలిచిన ఎంపీ ఆర్.కృష్ణయ్యను పోలీసులు అరెస్టు చేయడం సరైంది కాదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్ కృష్ణయ్య అరెస్టును ఖండిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ, మండల, పట్టణ అధ్యక్షులు ధూళిపాల శ్రీనివాస్, అంజియాదవ్, బి.గోవిందరావు, నాయకులు జె.శ్రీనివాస్, సతీష్‌కుమార్, రాయల వెంకటేశ్వర్లు, బి.నాగేశ్వరావు, వెంకీ, శ్రీనివాస్, నరేష్, కోటేశ్వరరావు, కార్తీక్, చందు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్య హోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా స్వామివార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, బ్రహ్మాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మోతె : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని గోల్‌తండాలో గురువారం మ ధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన భూక్య లచ్చిరాం ఇంట్లో మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షాట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఒక్కసారిగా మంటలు చలరేగాయి. దీంతో పక్క ఇంటి వారు గమనించి మంటలు ఆ ర్పా రు. ఇంటి యజమాని వచ్చేసరికి అప్పటికే ఇంట్లో ఉన్న సామన్లు, ఆస్తి దస్తావేజులు దగ్ధమయ్యాయి.